కథానిక :

# ★ కిటికీ ★

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

★

ఒ...క...టీ...ఒ...క...టీ...
అడుగులు నెమ్మదిగా వేస్తూ వెళ్తోంది పాతకర్ర.

అరిగిన పాతకర్రని పట్టుకున్న ఎండిన కొమ్మలాటి చెయ్యికూడా దాన్తోపాటు అలానే నెమ్మదిగా వెళ్తోంది.

విద్యుద్దీపాల వెలుగునంతటినీ ఆరబోసిన ముగ్గులా పరుచుకొన్న సిమెంటురోడ్డు అంతే నెమ్మదిగా వెనక్కి జరుగుతోంది.

వెళ్ళగా వెళ్ళగా ఆరబోసిన ముగ్గు గడ్డకట్టిన తారుగా మారింది.

కృష్ణ సర్పంలా మెరిసే తార్రోడ్డు కూడా వెనక్కి జరిగి జరిగి ఆఖరయింది.

పాతకర్ర ఆగి సేద తీర్చుకొంది ఒక్క క్షణం.

ఇంకా ఎంత దూరం ?

తారూ, కంకరా కలిసే స్థలంనుంచి ఇంకా ఇరవై 'ఎలక్ట్రిక్' దీపాలు దాటాలి. అక్కడనుంచి ఎడంచేతి వైపు మళ్ళి, ఎనభయ్యడుగులు నడవాలి.

ఇరవై దీపాల కంకర్రోడ్డూ, ఎనభయ్యడుగుల కాలిబాటా దాటగా,

ఎడమవైపున ఉండేది పాతమేడ.

కుడివైపున ఉండేది సగం కూలిన పెంకుటిల్లు.

ఆ పాతమేడ వినా ఆ ప్రాంతం విద్యుచ్ఛక్తితో గాని మరెట్టి కాంతితో గాని ప్రకాశించదు. అంతా అంధకారం.

ఎదురెదురుగా ఉన్న ఆ రెండు ఇళ్లూ దాటిన తరువాత ఏవేవో తోటలూ, ఎవరెవరివో చిన్న చిన్న ఇళ్లూ లేక పోలేదు. కాని ఎండిన చేత్తో ఆ పాత కర్రని పట్టుకున్న మనిషికి వాటి వేటితోనూ సంబంధం లేదు.

కూలిపోయే ఇంట్లో ఇంకా పూర్తిగా పడిపోకుండా నిల్చిన వరండాలో కూర్చొని చూడ్డానికే అతను వెళ్తున్నది.

క్షణంసేపు సేద తీర్చుకున్నాక దీపాలు లెక్కపెట్టుకుంటూ, ఎంతో అలసి పోయినట్టుగా ఊపిరి తీస్తూ బరువు నడక సాగించేడు.

ఇరవై దీపాల దూరంగల కంకర్రోడ్డు ఎలాగయితేనేం వెనక్కి వెళ్ళింది. పాతకర్ర ఎడమవైపుకి మళ్ళింది.

ఇహ ఉన్నవి ఎనభయ్యే అడుగులు.

పైన చంద్రుడు లేడు. అక్కడ పక్కన మ్యునిసిపల్ దీపాలు లేవు. నక్షత్రాల కాంతి అతని కంటికి చాలదు.

చాలా చీకటిగా ఉంది. కొంచెంగా చలిగాలి వీచింది.

చీకటిగా ఉన్నప్పటికీ చేతికర్రకి దారి బాగా తెలుసు. అలసి పోయినప్పటికీ ఎనభయ్యడుగుల మేరనీ తొందరగా వెనక్కినెట్టి నిట్టూర్చింది.

అదిగో కిటికీ ! !

ఇదిగో వరండా.

పెంకుటింటి ముందు భాగం మాత్రం కొంత నిల్చింది. చీకటిలో నిండిన ఆ ఇంటి వరండాపై కప్పు

ఒక వార కొంత మేరకూలింది. కింద, గచ్చు, ఎన్నో చోట్ల, దాదాపు అంతటా, గాయాలు పడింది. ఉన్న రెండు రాతి స్తంభాలకీ రక్త మాంసాల్లేవు, ఇంటికి ఇవతల నిల్చొని ఇంటి మీదక్కూడా విస్తరించు కొంది ఓ మామిడిచెట్టు. కప్పుకూలిన వైపు వరాండా మీదా, ఆ మామిడిచెట్టు మీదా ఎదటి మేడ లోంచి వచ్చే దీపం వెలుగు పల్చగా పడుతోంది.

ఆ వరాండాలో చీకటిగా ఉన్న వైపు గోడని అనుకుని కూర్చొని, కర్రని పక్కన పెట్టి, ఎడం భుజాన్న ఉండే బరువుతీసి ఎదురుగా పెట్టుకొని, ఎదట మేడవైపు తలెత్తి చూసేడతను.

కిటికీ కనిపిస్తోనే ఉంది.

మిగతా మేడంతా చీకటి. ఆ కిటికీవే కనిపిస్తోంది.

చాలీచాలని నక్షత్రకాంతి నిగనిగలాడే రాత్రిలో కరిగి పోతోంది. ఎదట ఉండే పాతమేడా మేడ వెనక తాటిచెట్లవరసా, చీకట్లో కలిసీ కలియ నట్టుగా ఉన్నాయి. తాటిచెట్ల తలల్లోంచి చిన్న చిన్న చుక్కలు కనిపించని కదలికతో ఆకాశంలోకి లేస్తున్నాయి.

అవన్నీ చీకట్లో ఛాయలు. వట్టినీడలు. ఆ నక్షత్రాలైనా, అవన్నీ చీకట్లో మునిగిన మెరుగు తగ్గిన రాళ్లు.

ఆ కిటికీ ఒక్కటే ఆ ప్రాంతంలో ఆ నిశీథంలో ధగ ధగ లాడేది; జిగ జిగ మెరసేది.

మేడమీద ఒకటేగది, సరిగ్గా ఆ గది వెడల్పునా దాని పక్కనే చిన్న డాబా ఉంది. గదినీ, డాబానీ వేరుచేసే గదిగోడకి ఎదురుగా ఉంటుంది, అతను కూర్చొనే స్థలం. అతనికి ఎడమవైపుది గది. కుడివైపుది డాబా.

ఆ గది అట్టే పెద్దదికాదు. గదికి మధ్యగా ఉన్న ఆ కిటికీ చిన్నదికాదు. ఇనపవిగాని, మరెట్టివిగాని కిటికీకి ఊచల్లేవు. తలుపులు తెరుచుకొనే ఉంది. వెనక వెల్తురులో వజ్రంలా ప్రకాశిస్తోంది.

చిట్టచీకటి తెరని ఆ కిటికీఉన్న ఒక్కచోటా కత్తిరించి అడున దాగున్న వెలుగుని ఎవరో చూపెడుతోన్నట్టుగా ఉంది. ఎవరో పుణ్యాత్ములు ఆ తెరని ఆ మేరకి కత్తిరించో లేక ఒత్తిగిలించో అవకాశం కలిగిస్తున్నారు ప్రతి రాత్రీ అతనలా చూసి సంతోషించడానికి, అను నిమిషం తన్మయుడవడానికి.

తెరవెనక అంతా ఆనందం, తెరఇవతల వానికి లేనిది సౌఖ్యం.

అతనికి లేనిది, అతనికి కావాలని ఉన్నది, అందరికీ ఉండాలని అతను కోరేది అంతా ఆ కిటికీ వెనక ఉంది. కిటికీలోంచి కనిపిస్తోంది.

కిటికీ వెనక ఉన్నది ఏమది ?

తెల్లగా, వెల్ల వేసిన గోడలతో ఒకే ఒక గది.

చీకటి వరాండాలో కూర్చొన్న మనిషికి ఆ గదిలోవి కనిపించేవి ఏమవి ?

ఆకుపచ్చ గాజు టోపీ పెట్టుకొని, తీగని పట్టుకొని గది మధ్యకి జారిన విద్యుద్దీపం; ధగ ధగ లాడే దీపం వెలుగు; ఎదట గోడని బ్రాకెట్ మీద ఒక నీలి రంగు గాజు గడియారం; దానికి పక్కగా పెద్దదికాని అద్దాల బీరువా; బీరువామీద పేర్చిన నల్లటి గంధపు బొమ్మలు; వాటి మధ్య రంగులు వేసిన రెండు చిన్న పాలరాతి విగ్రహాలు—ఒకరు లక్ష్మి, ఒకరు సరస్వతి; బీరువాపైన గోడని ఒక పటం; అందులో పడుకొని పుస్తకం చదివే ఆడమనిషి బొమ్మ; దానికిపైన గది కప్పు బిళ్ళ పెంకు; ఒక వార ఉండే దోమ తెరకట్టిన పందిరి మంచపుకోన; కిటికీకి చేరువగా ఒక మనిషి కూర్చో వీలయే సోఫా.

ఇవన్నీ ఆ కిటికీలోంచి అతనికి సుస్పష్టంగా కనిపించవు. కాని, చాలా మనోహరంగా కనిపిస్తాయి. సుస్పష్టంగా కనిపించకపోవడం చేతనే ఎక్కువ మనోహరంగా ఉంటూ యతనికి. ఆ గదిలో,

వాళ్ళిద్దరూ ఉంటారు !! వాళ్లిద్దరే ఉంటారు'

ఆవిడ, ప్రాణం వచ్చిన పాలరాతి బొమ్మ; చిగిర్చిన తీయమామిడి కొమ్మ; వికసించిన కుసుమం; స్తంభించిన విద్యుల్లత; దిగివచ్చిన దేవత.

నవనవలాడే లేజవరాలు.

అతని శరీరం మెరుగుపెట్టిన లోహం. అతన్ది కుతకుతలాడే రక్తం. అతను కొమ్మపై వాలిన గండు కోయిల; మనిషిగా మారిన మధుపం.

అత నామెకోసం దిగివచ్చిన దివ్యుడు.

అది గదిగా మారిన స్వర్గం. అది తెరవెనక స్వప్నం. అక్కడ నిత్య వసంతం.

తెరచిన తెరలోంచి ఈ స్వప్నాన్ని, ఈ నిత్య వసంతాన్ని, ఈ స్వర్గాన్ని చూడ్డానికే అతను నడచి నడచి నడచి నడచి వస్తోన్నది.

ఎన్నాళ్ళనుంచి ?

—ఓ యాడాదవుద్ది కామోసు.

ఆపట్నంవచ్చి సంవత్సరం అయింది. లేక, కావచ్చింది. వచ్చినరోజు రాత్రి దారితప్పడిపోయి తిరుగుతూండగా, చీకట్లో దొంగచాటున వచ్చిన సికందరుసైన్యంలా నల్లమబ్బులు అన్నివైపులనుంచీ కమ్మేశాయి. కురిసేవరకూ వర్షం వస్తోందన్న సంగతి అతను గమనించనేలేదు.

ఒక్కసారిగా గడగడలాడించే చలీ, మొత్తేసే జడివానా వచ్చిపడ్డాయి.

పక్కనేఉన్న ఆ వరాండాలోకి తననీ చేతి కఱ్ఱనీ చప్పున చేరవేయవలసి వచ్చింది.

ఆదినం వంట్లో బావుందికాదు. అన్నం హితవు కాలేదు. సహించింది కాదు.

వళ్లంతా వడవడ వణుకుతోంది. మనసంతా బరువుగా ఉంది. చూస్తోండగానే గుండె చెరు వయింది.

—యెదవ యెదవ యెదవ బతుకు.

ఈరీతిగా ఎన్నాళ్లు? ఎన్నాళ్లయినా ఎందుకు?

వీధిలో ఎండ. ఏటిలో నీరు. చెట్టుకిందనీడ.

ఎంతకాలం?

ఎక్కణ్ణించి ఎలా వచ్చేను? ఇక్కడ ఇలా ఎందుకు ఉంటున్నాను? ఎప్పుడు ఎలా ఎక్కడికి పోతాను?

అనే ప్రశ్నలకి ఎవరికైనా జవాబులు తెలుసునేమోగాని, అతనికి అటువంటి ప్రశ్నలు వేసుకోడం కూడా సరిగ్గా తెలియదు.

"నేను" అనే పదంయొక్క అన్ని విభక్తులతోనూ నిండిన ఈలోకంలో "పడ్డం"చేత అతనికి నొప్పిగాఉంది. కాని, ఆనొప్పికి కారణం స్పష్టంగా కనిపిస్తూన్నా ఎవ్వరికీ తెలియనట్టే అతనికూ్కడా తెలియదు.

వర్షం పడుతోంది. చలివేస్తోంది. అతను దుప్పటీ దగ్గరగా లాక్కొని కప్పుకున్నాడు. అతని వళ్లంతా పీకుతోంది.

—కాళ్లడిపోతున్నయ్.

దూసుకువచ్చే చలిగాలి. జల్లుజల్లుగా జడివాన. మధ్యమధ్య మెరుపునాలికలు. మాటిమాటికీ ఉరుముల ఘోష.

వానజల్లుకి వరాండా తడుస్తోంది. సగంమాత్రం నిల్చిన మూరులోంచి నీరు ఉరుస్తోంది.

—సత్తే శానా సుకం. యేం! ఓ పిడుగడ కూడదా?!

పిడుగు పడింది కాదు. పిడుగులు ఎక్కడెక్కడో పడ్డాయి. మూలనున్న ముసలమ్మని కొట్టడం ఎందుకనికాబోలు పడిపోయే పెంకుటింటిని మాత్రం అన్ని పిడుగులూ విడిచిపెట్టేయి.

—నాలాటోణ్ని సూసే దాతే నేడు! బగమంతుడే సూణ్ణప్పుడు ఆరి మాటా ఈరి మాటా సెప్పుకు నేటి నాబం?!

పడే పిడుగులూ, చూసే దాతలూ, చూసీ చూడని భగవంతుడూ కూడా అంటకుండా దూరంలోనే ఉంటూఉండడం జరిగింది. జరుగుతోంది.

—ఈపాలికి సత్తే బావుంటాది.

"చస్తే బావుండును" అని అనుకొనేంతవరకూ పరిస్థితి "వచ్చింది" అనడం నిజం కాదు.

పరిస్థితి ఎప్పుడూ అక్కడే ఉంది. పరిస్థితులు ఎప్పుడూ ఒక్కలాగే ఉన్నాయి.

జ్ఞానం వచ్చినప్పటినుంచీ ఇలాగే ఉంది అవస్థ.

ఎవరు కన్నారో వారు గుర్తులో లేరు.

దౌర్భాగ్యులు! పాపాత్ములు! శక్తిహీనులు! బానిసలు!

ఎవరో ఒకరు కన్నారు.

భయంతో కన్నవారు భయపడి పారిపోయేరు.

ఇహ జ్ఞప్తికి వచ్చేదెలా?

పెంచిన ముసలమ్మ మాత్రం బాగా జ్ఞాపకం ఉంది.

"నానే గాని సూడకపోతే ఆపొద్దే సస్దువురా గుంటనాయెదవ! ఇశివాసంగా బతకరా"

అని మాటిమాటికీ చెప్పే ముసలమ్మ హింసించి హింసించి హింసించి ఏనాడో పోయింది.

ఎంతగా ఎంతగా హింసించింది!!!!

పోయే ముందు ఈ దార్లోనే వదిలేసింది.

ముసలమ్మ నడిచి చూపెట్టిన దయ్యాల బాట వెంబడి నడవక తప్పటంలేదు. మరో మార్గం కనిపించదు. ఎవరూ చూపించరు.

ఈ దయ్యపు బతుక్కి ఆనందం, సౌఖ్యం ఉండవు. కాని కొన్ని—అతి తక్కువ—మధుర స్మృతులు మాత్రం ఉన్నాయి.

అవి ఎట్టివి? ఎంత గొప్పవి? లేకుంటే ఎంత బీదవి? పచ్చటిముఖంతో, రూపాయంత బొట్టుతో, కుండంత కొప్పుతో, మందహాసరేఖతో ఓ ముసలావిడ ఓ మధ్యాహ్నం దయతో పిల్చి, ఆదరించి, దీవించి, పంపింది. దీవన ఫలించకపోతే నేం? దయతో దీవించడం ఎంతకాదు? ఒకనాడొక తప్పిపోయిన పిల్లని తల్లిదగ్గర చేరవేసినందుకు ఆమె ఒక సరికొత్త పంచె ఇచ్చింది. ఒకరాత్రి తాగి తందనాలాడే సీమ సిపాయి అయిదురూపాయిలు పారేసుకున్నాడు. తన అన్నం కొంత పెట్టినందుకు ఒకరాత్రి ఒక ఆడమనిషి ఒంటిమీద చెయ్యి వేయనిచ్చింది. ఓనాడు ఓ పోలీసువాడు కొట్టకుండా విడిచిపెట్టేడు. ఓ సాయంకాలం కరవబోయిన వెర్రికుక్కని ఎవరో వచ్చి తరిమి తరిమి కొట్టేరు.

స్మృతిపథాన మధురంగా మెరిసేవి ఇవిగాక—

ఓ వూళ్లో చెట్టుకింద గజ్జెకట్టి గంతులు వేసిన ఆడపిల్లా; రెయిలుబండీలో కూర్చొని పిల్లడికి పాలిస్తూ ఒకసారి కనిపించిన వెన్నెలవంటి ఒక చల్లని తల్లీ; ఒకరాత్రి "ఊర్మిళమ్మ నిద్ర" పదం పాడిన జంగిలీవాడూ; ఓ సత్రంలో కూర్చొని చిలుం వేడిలో మంచుకొండల మహిమలు చెప్పిన బైరాగి మనిషీ; వీళ్ళగురించి, వీటిగురించి తల్చుకున్నప్పుడు కూడా మధురంగా ఉంటుంది.

మిగతాదంతా

—గడ్డు, గడ్డు, గడ్డుబతుకు.

కాలంలో ఉన్నన్నాళ్లు, జబ్బుచేయనన్నాళ్లు ఫరవాలేకపోయింది.

ఇప్పుడు కాలం బాగా మళ్ళింది. జబ్బు చేసింది. కర్రపట్టుకొంటూంటే చెయ్యి వణుకుతోంది. చలికాలం కాకపోయినా చలివేస్తోంది. వేసవికాలం కాకపోయినా ఎండ భరించ శక్యం కాకుండా ఉంది. నిండినా నిండకపోయినా కడుపు ఒక్కలాగే ఉంటోంది. నిండకపోడం పరిపాటవుతోంది.

బైట,

అంతటా వర్షం పడుతోంది. ఎక్కడో పిడుగు పడింది. మాటిమాటికీ మెరుస్తోంది.

అతనుమాత్రం ఎటూ చూడకుండా "చస్తే ఎంత బావుండును" అనే విషయం గురించి ఆలోచిస్తూ కూర్చుండిపోయేడు.

చిన్నమగత నిద్రపట్టింది కాబోలు.

ఇంతలో చూరునుంచి ఒక పెంకు జారిపడింది కాబోలు. అందుకే కాబోలు అతనికి మెలకువ వచ్చింది.

కళ్లు నులుపుకొని అటూ ఇటూ చూస్తున్నాడు.
కంటికి కనిపించని చిక్కటి చీకటితో నిండుకొని, అండాలతో నీళ్ళు కుమ్మరించిన ఆకాశం, నిద్రలేచి చూసేసరికి, నల్లగా నిగనిగలాడుతూ కంటికి స్పష్టంగా కనిపిస్తోంది. అందులో, వెదజల్లిన ముత్యాల్లాగ ఎక్కడ ఎటుచూసినా చక్కటి చుక్కలు వెలుగుతున్నాయి. ముత్తేసిన మేఘాల్ని చలిగాలి ఇంకోవైపుకి ఎక్కడికో మోసుకుపోయింది. గాలి వీయడం లేదు. అంతా నిశ్శబ్దంగాఉంది.

స్నానంచేసి, కొత్తబట్టలు కట్టుకొని, పువ్వులు పెట్టుకొని, దీపంలేని గదిలోకి వచ్చిన ఆడమనిషి శరీరంలా ఆ రాత్రంతా ఎంతో చల్లగా ఉంది.

అంతా నిశ్శబ్దంగా ఉంటూండగా, అతనలా చూస్తూండగా, ఎదటునుంచి,

తలుపులు తెర్చుకొని వెయ్యి దీపాల వెలుగు బైటికి వచ్చింది.

వెలుగులోంచి దేవత లెవరో వీనుల విందుగా నవ్వేరు.

అప్పుడే నిద్రలేవడంచేత, ఎదట మేడ కనిపించక పోడంచేత, అక్కడ ఇల్లున్నాదని తెలియక పోడంచేత, ఆకాశానికి తలుపులు తెరిచేరనే అనుకున్నాడు. స్వర్గంలో దేవతలు నవ్వుతున్నారనే అనుకున్నాడు.

ఒళ్ళంతా జలదరించి, పులకరించి తన్మయత్వం పొందింది.

వెలుగులోంచి రెండు చేతులు బైటికి వచ్చేయి.

"జల్లు పూర్తిగా పోయిందండీ! ఎంత చల్లగా హాయిగా ఉందో చూసేరా!

"నీకంటేనా?"

ఆవిడ చేయీ అతని చేయీ లోనికి పోయేయి.

ఆవిడ అటువైపు తిరిగింది. అత నావిణ్ని వెనక్కి లాగేడు.

ఎవరు వారు?

మనుష్యులు కారు, దేవతలు కాదు, మనుష్యులే కాదు, దేవతలే!

వాళ్లనలా చూడాలనే అనిపిస్తోంది.

వాళ్లని చూడకుండా ఉండలేకుండా ఉన్నాడు.

ఆనాడు వర్షం కురుస్తూండగా, మిక్కిలి చీకటిగా ఉంటూండగా "ప్రాణంపోతే ఎంత హాయిగా ఉండేది" అనుకొంటూ చిన్న కునుకు తీసేడు.

నిద్రలేచేసరికి వర్షం వెలిసింది. ఆకాశం పువ్వులు విరిసింది. దేవతలు తలుపులు తెరచేరు.

ఆక్షణానికి అది నిజంగా స్వర్గమే.

అందుచేతనే ప్రతిరాత్రీ అక్కడికి లాక్కుపోతుంది ఆ అరిగిన పాతకర్ర.

ఏడాదిక్రితం ఆవూరు వచ్చిన తొలిరోజురాత్రి ఆ కొన్నిక్షణాలూ, "అది స్వర్గం; వారు దేవతలు" అని కలిగినట్టి ఆభావన, ప్రతిదినమూ ఆచీకట్లో అక్కడికివెళ్లిన కొన్నిక్షణాలు—అతనికి మళ్లీ కలుగుతుంది. ఆ కొన్నిక్షణాలూ కూడా అతని మనసు గాల్లో తేలి, చుక్కల్ని చేరి, అమృతంలో మునుగుతుంది.

ఆదృశ్యం చూడ్డానికైనా, అనుభూతి పొందడానికైనా బతకాలని ఉందతనికి.

ఆరాత్రినుంచీ అతణ్ణి బతికిస్తూ వస్తూన్నదే ఆదృశ్యం.

ఆకాశం కాదు; పాతమేడ. స్వర్గానికి సింహద్వారం కాదు; ఊచల్లేని కిటికీ. ఇంద్రనగరపు దీపశిఖరం కాదు; ఊళ్లో ఉండే మామూలు విద్యుద్దీపం. దేవతలు కారు; సామాన్య యువతీ యువకులు.

అది స్వర్గం కానేకాదు; వెల్ల వేసిన చిన్న గది.

అవొచ్చు. అంతే కావచ్చు. నిజం అంతే కూడాను. కాని ఆనిజంతో అతనికి ప్రసక్తిలేదు.

ఇంద్రుని హర్మ్యం. స్వర్గకవాటం. రత్నఖచిత కుడ్యం. మాణిక్య దర్పణం. హంసతూలికా తల్పం. అమరుల ఆరనిదీపం. సువర్ణసింహాసనం. నిర్జరమిథునం, అతివాస్తవిక అథివాస్తవిక స్వర్గం.

అతనికి—

అదే నిజం. అవే నిజం. వారే నిజం.

తనకి ఎంతో నిజమైన ఈ అబద్ధాన్ని చూడ్డానికే—(అతని స్థాయికి అది నిజమేనేమో)—అతను ఎంతో దూరంనుంచి శ్రమపడి వస్తోన్నది.

నిజం ఏమిటో, వాళ్లు నిజంగా ఎవరో అతనికి తెలుసుకోవాలని లేదు. తెలిస్తే రోజూ కలిగే భావన మరింక కలక్కపోవచ్చు. ఆ భావనని, ఆ భ్రాంతిని విడిచిపెట్టుకుందామనే ఉద్దేశం లేదతనికి.

వాళ్ళనసలు, రాత్రివేళ తప్పించి పగటిపూట చూడనైనా చూడ్డతను.

వాళ్ల అసలు రూపాలు, నిజ వృత్తులు, సంఘంలో వారి స్థానాలు, అటువంటి వాటితో అతనికి నిమిత్తం లేదు. తెలుసుకుందామనే కుతూహలం లేదు. ఆనందంగా, సంతోషంగా వాళ్ళా గదిలో అలానే ఎప్పుడూ ఉంటూ అతనికా తన్మయత్వాన్ని ప్రసాదిస్తూంటే చాలు నతనికి.

వాళ్ళు ఇంతవరకూ అలా సుఖంగా ఉంటూనే వస్తున్నారు.

వాళ్ళు ఏం చేస్తూన్నా అతనికి హాయిగానూ, సుఖంగానూ ఉంటుంది.

సోఫాలో కూర్చుంటారు, మంచంమీద పడుకుంటారు. అద్దంలో చూసుకుంటారు. డాబామీద పచారు చేస్తారు. ఏదో చదువుకుంటారు. ఆకాశంలోకి చూస్తారు. కళ్ళల్లోకి చూసుకుంటారు.

ఎప్పుడూ నవ్వుతూన్నట్టుగానే ఉంటారు.

"నూతన వధూవరులా? లేచివచ్చిన మేనత్త మేనమామ పిల్లలా? ఆ ఇల్లు వారిదేనా? ఆవిడది ఏం కులం? అతనికి ఏం పని?"

వీటికి సమాధానాలు ఎవరికైనా కావాలా?

అతనికి మాత్రం అక్కర్లేదు.

రాత్రి చక్కగా ఉంది. గదిలో వెలుగ్గా, వెచ్చగా ఉంది. జంట ఎంతో ఇంపుగా ఉంది.

అందుచేత, పైన చీకట్లో, వరండాలో, కూర్చొన్న మనిషికి భ్రాంతిగా హాయిగా ఉంది.

కొంత రాత్రివరకూ దీపం వెలిగే ఉంటుంది.

తరువాత దీపం ఆర్పేసి ఆ సోఫాలో ఇద్దరూ కూర్చుంటారు. కూర్చోడం అతనికి కనిపించదు; కాని అలా కూర్చుంటారని అతనికి తెలుసు. వాళ్లెప్పుడు పడుకొక్కనేదీ కూడా అతనికి తెలుస్తుంది.

వాళ్లు పడుకున్న తరువాతనే గాని అతను పడుకోక్కడు. ఇంతదూరం ఇది చూడ్డానికి వస్తున్నాడని వింటే అందరూ ఆశ్చర్యపోవడమే కాక, నవ్వుతారని కూడా అతనికి తెలుసు.

ఆశ్చర్యకరమైనది, పరిహసించ తగినది అవుతే అవుగాక, పొట్టలు చెక్కలయేలా అందరూ నవ్వుతే నవ్వుదురుగాక, కాని, ఆ కత్తిరించిన తెరవెనక దృశ్యాన్ని అతను చూడకుండా ఉండలేడు. అది చూడ్డానికే బరువుగా ఉండే రోజుల బళ్లని ఈడ్చుకు వస్తున్నాడు, ఒక ఏడాదినుంచి.

అక్కడికి వెళ్ళి, ఇక్కడికి వెళ్ళి, ఎక్కడెక్కడికో వెళ్ళి, అందరిచేతా తిట్లుతిని, ఎండదెబ్బ అదేపనిగా తిని, ఈ ఎండిన మనిషి పగల్లా ఎన్నెన్నో తిప్పలు ఎలా పడగలుగుతున్నాడు? దిన దినానికీ శక్తి తగ్గుతూన్నా ఎలా తిరగ్గలుగుతున్నాడు?

పగలంతా అబద్ధం అనుకొని, ఆ రాత్రే నిజం అనుకొని, రాత్రికోసం పగలంతా అతను బరువుని మోయగలుగుతున్నాడు. బాధని సహిస్తున్నాడు.

కాని, ఊరిచివరకి ఊరిచివారకి, అన్నిటినీ దాటుకొని అన్నింటినీ దాటుకొని, అంతదూరం—ఎంతోదూరం ఎందుకు వెళ్తాడో ఎవ్వరికీ తెలియనివ్వడతను.

అది అతని ప్రత్యేకమైన పరమరహస్యం.

తనెందుకంత సంతోషంగా ఉన్నాడో తన తోడివారికి తెలియదు. తెలియకపోడంచేత వాళ్ళకి చిరాగ్గా ఉంటుంది. అతనికి చాలా సరదాగా ఉంటుంది.

అందర్నీ పిల్చుకువెళ్ళి చూపించాలనే ఉంటుందతనికి.

కాని అంతా కలిసి వెక్కిరిస్తారు. వేళాకోళం చేస్తారు. అతణ్ని అల్లరి చేస్తారు.

తన కది స్వర్గంలా ఉందని చెప్తే వారికి అర్థం కాదు.

—ఓ యాడాదవుద్ది కామోసు.

అనుకున్నాడు కిటికీలోకి చూస్తూ.

ఆవిడ సోఫాలో కూర్చునేఉంది. అతనామెకి దగ్గరగా సోఫా చేతిమీద కూర్చొని నవ్వుతూనే ఉన్నాడు. తీగపట్టుకు జారిన విద్యుద్దీపం వెలుగు వెదజల్లుతూనే ఉంది. అంతా హాయిగా ఉంటూనే ఉంది.

స్వర్గం స్వర్గంలాగే ఉంది.

అతనలా చూస్తూనే ఉన్నాడు.

కాని—

అలసటగా ఉందతనికి!

అతనికి ఎంతో అలసటగా అలసటగా ఉంది.

స్వర్గాన్ని చూసినంత మాత్రాన అమరత్వం సిద్ధించదు.

అలసటైనా తగ్గదు.

తగ్గినట్టు తోచినా నిజంగా తగ్గదు.

బరువుగా రోజుల్ని ఈడ్చే మనుష్యుల జవసత్వాల్ని బరువురోజులు పీల్చి పారేయక తప్పవు! తప్పవు!

ఆరేసిన ముగ్గులోంచి, గడ్డకట్టిన తారుమీంచి, గతకలుపడ్డ కంకరలోంచి నడవడమే కష్టంగా ఉండెను. దానికితోడు ధూళితో నిండిన బాటలో ఆ ఎనభయ్యడుగులూ తొందరగా నడవడంచేత కాబోలు అలసటగా ఉంది.

అలసిపోయిన కళ్లు అమరలోకాన్ని చూస్తూనే ఉన్నాయి.

తాటిచెట్ల తలల్లోంచి లేచే నక్షత్రాలని కారు మేఘాలు కబళించేస్తున్నాయి.

కొంచెం చలిగాఉంది. అతనికి అలసటగా ఉంది.

అదీ!

—ఏట్రా అని సూత్తుండాను, ఇయ్యాల అల్చిపోనాను.

నడుం చేరవేసినా అలసటగా ఉంది.

—గుండెలేటి ఇలా కొట్టుకుంటున్నయ్?!

గుండెల్లో దడగా, నీరసంగా ఉంది.

—ఈపొద్దింత సలేత్తోందేటి?

మధ్యాహ్నం ఎండగా ఉండెను. సాయంకాలంనుంచీ చలిగా ఉంటోంది.

ఇప్పుడు హెచ్చు చలిగా ఉండడమేకాక బాగా చీకటిగాకూడా ఉంది.

కత్తిరించినచోట తప్పించి మిగతా తెరంతా చాలా నల్లగాఉంది.

—ఆపొద్దునాగే ఈపొద్దుకూడా సినుకడుద్దికామోసు. మాసెడ్డ సలిగాఉందే...దుప్పటిముక్క సిరిగిపోనాదిగందా...ఏటిసెయ్యడం?

ఆకోసనుంచి ఈకోసవరకూ ఆకాశం చీలి బద్దలయింది. మళ్ళీ అతుక్కుపోయింది. బలమైన గాయం తగిలినట్టు పెద్దగా ఘోష పెట్టింది.

చలిగాలి అధికారం చలాయిస్తోంది.

స్వర్గానిక్కూడా చలిగాలి సోకిందికాబోలు.

"తలుపులు వేసేదామండీ" అంది దేవత.

"సరే" అన్నాడు దివ్యుడు.

—అరే! తలుపేసేసినారే!

సింహద్వారం మూసుకుపోయింది.

తెరచిన తెర కప్పుకు పోయింది.

—ఇంతసీకటిగా ఉందేటి బగుమంతడా!

చీకటివరదలో మధురస్వప్నం మునిగిపోయింది. ఆవరించుకొన్న మేఘాలపొగల్లో మాయమయింది. నిత్యంగా ఉండాల్సిన వసంతం ఎక్కడకి పోయింది? కళ్ళముందు కదలాడిన స్వర్గం ఏదీ ఎక్కడ?

—రేపు రేతిరిగ్గాని తెరవరే!

బతికిఉంటే సూడవచ్చు.

రేపటివరకూ ఎలా బతకడం?

గుండెల్లో మండేవి మంటలు. పొగల్లో ఉంపు లేనిది ఊపిరి. వరదలో తేలేవి కాళ్ళు. కడుపులో కదిలేవి తేళ్ళు. వీపని పడేవి కాల్చిన మేకులు.

—జల్లడుతోంది.

తెరలు తెరలుగా కమ్ముకున్న మబ్బులు వాడి సూదుల తెరని కిందకి జారవిడిచేయి. వరాండాలో పడుక్కున్న అతనిమీద కూడా సూదుల తెరని తెచ్చి పడేస్తోంది ఈదురుగాలి.

—సలి సంపేత్తోంది.

రివ్వున చలిగాలి. రివ్వురివ్వున చలిగాలి.

—యదవ గాలి యాడనించొత్తందో, పేనం తినేత్తోంది.

కూలిపోయే ఇంట్లో, రాత్రివేళ చీకట్లో, ఒంటరిగా పడుకొన్న ఈ ఒక్క ముసలి పక్షిని చంపడానికి,

ఎంత శక్తిని కూడగట్టుకొని,

ఎక్కణ్నించి వస్తోందీ చలిగాలి?

ఎంతదూరంనుంచి వస్తోందీ దయలేని గాలి?

మంచుకొండల మీంచి, కొండలోయల్లోంచి, అటవీ ప్రాంతాల మీంచి, శీతల జలాల మీంచి, సూర్యుడు చూడని బీడు భూములమీంచి, ఘనీభవించిన చీకటి సముద్రాలమీంచి, వెల్తురుచొరని పాముల గుహల్లోంచి, శూలాల మొనలమీంచి, కత్తుల పదును మీంచి, ఉండే చలినంతా కూడగట్టుకొని, ఎన్నో దిక్కులనుంచి, ఎంతో దూరంనుంచి శర వేగంతో, శర సముదాయంలా వచ్చే ఈ దయలేని చలిగాలి,

ఎముకల్ని దూసుకుపోతోంది;

ప్రాణాల్ని తీసుకుపోతోంది.—

రాత్రంతా పడినది వర్షం.

ఉదయం ఉదయించిన వాడు బాలార్కుడు.

కిటికీ తలుపులు తెరచినది పూర్ణచంద్ర నిభానన.

తలుపులు తెరచిన కిటికీదగ్గర నలిగిన తెల్ల చీరతో నిల్చున్న చంద్రముఖి, బద్ధకంగా వళ్లు విరుచుకొని, పడిపోయే ఎదటింటి వరాండావైపు చూసి, ఇంకా మంచంమీదే ఉన్న తనవానితో

"పాపం ఆ ముసలాడెవడో అక్కడెలా ముణుచుకు పడుకున్నాడో చూడండీ! రాత్రంతా ఎంత చలి వేసిందో ఏమో!" అంది.

"నా క్కూడా ఇంకా చలిగా ఉంది. ఇలారా!" అని అతను శయ్యమీంచి పిల్చేడు.

"నే రాను" అంటూనే ఆమె అటువైపు వెళ్ళింది.

పడిపోయే పెంకుటింటి వరాండాలో "ముణుచుకు పడుకొన్న ముసలాణ్ని" ధూళితో నిండిన, నలిగిన, చినిగిన, పేలికలవుతూన్న పాత దుప్పటీ సరిగా కప్పడంలేదు.

అతను కుళ్ళిన బూజుపట్టిన చేవలేని కర్రలా ఉన్నాడు. వర్షంలో తడిసిన కుళ్లు చెత్తలా ఉన్నాడు. ముడతలు పడ్డానికూడా వీల్లేనంతగా ఎండిపోయింది అతని చర్మం. తలచూస్తే అంతా చిక్కులుపడ్డ బూజులా ఉంది. తలమీద ఉంది కాబట్టి జుత్తని అనుకోవాలి, గడ్డం ఎదగడానికూడా వీల్లేనంత నీరసంగా ఉంది అతనిముఖం· ఆ ముఖంలో ఎడమ కన్ను లేదు. వంగిన వింటిబద్ద అతని వీపు. మోచేతివరకూ వచ్చి తెగిపోయినది అతని ఎడమచేయి. అతని కుడికాలికి లేనిది పాదం, పాదం ఉండవలసినచోట ఉన్నది ధూళితో నిండిన ఒత్తుగా కట్టిన గుడ్డలకట్టు.

అతని తలకింద ఉన్నవి తడిసిన మాసినగుడ్డలు· అతని వంటికింద ఒక పొట్టిగోనె.

అతని పక్కని ఉన్నవి; ఒక పాతకర్ర, తుప్పుపట్టిన రేకుడొక్కు, రెండు చుట్టపీకలు, ఒక తూట్లుపడ్డ మాసిన సంచీ.

ఆ సంచిలో ఏముందో ఏమిలేదో కనిపించడం లేదు.

బాగా పొద్దెక్కింది. తాటిచెట్ల సందుల్లోంచి వచ్చే సూర్యకిరణాలు కొద్దిగా అతనిమీద పడుతున్నాయి.

కాని, ఈ లోకంలో ప్రాణానికి కారకుడైన ఆ సూర్యుడి కిరణాలు అతనిమీద ఆ సమయంలో పడ్డం అర్థరహితంగా ఉంది.

